సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 16 । మార్చి । 2025



149 కేంద్రాలు..

రేపటి నుంచే టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

- 8లో



ఓపెన్ స్కూల్ పరీక్షలకు..

ఓపెన్‌స్కూల్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. రేపటి నుంచే పరీక్షలు జరగనున్నాయి.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
ఆది (సా)	సోమ (ఉ)
6.08	4.47

న్యూస్‌రీల్

పరీక్షలపై ప్రత్యేక నిఘా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో న్యాయ విద్య ఎల్ఎల్‌బీ మూడేళ్ల, ఐదేళ్ల పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 22 వరకు పరీక్షలు జరగనున్నాయి. చూసీ రాతల ఆరోపణల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సెల్‌ఫోన్లు పక్కాగా తనిఖీ చేసి లోపలకు విడిచి పెడుతున్నారు. సబ్జెక్టు కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీకి ఇన్విజిలేటర్లుగా నియామకం నిలిపివేశారు. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మాత్రమే డ్యూటీలు వేస్తున్నారు. అధికారులు నిరంతరం పరీక్షలు పర్యవేక్షిస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు రాస్తున్న గదులపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని డీఆర్‌ఓ చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఫారెస్టు రేంజ్ అధికారి పరీక్షకు 546 మంది హాజరు కానున్నారని, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్లకు 152 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర కళాశాల, శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల, కోర్ కళాశాలలో ఎఫ్ఆర్‌ఓ పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతాయన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి



ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో పొట్టి శ్రీరాములు కూడలిలో ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆసియా ఒలింపియాడ్‌కు దేవాది విద్యార్థి




రుత్విక్ సాయి

నరసన్నపేట: ఆసియా స్థాయిలో సౌదీ అరేబియాలో నిర్వహిస్తున్న ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు మండలంలోని దేవాదికి చెందిన విద్యార్థి ధర్మాన జ్ఞాన రుత్విక్ ఎంపి కయ్యాడు. మే నెల 4 నుంచి 12వ తేదీ వరకూ ఆసియా స్థాయిలో సౌదీ అరేబియాలో 3వ స్థా యి సెమినార్ జరుగుతుందని, దీంట్లో రుత్విక్ పాల్గొననున్నట్లు తండ్రి ధర్మాన శంకర్‌నారాయణ తెలిపారు. ఇండియా నుంచి ఈ ఒలింపియాడ్‌కు 20 మంది విద్యార్థులు హాజరవుతుండగా ఏపీ నుంచి రుత్విక్ పాల్గొంటున్నాడని తెలిపారు. జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్‌లో 99.98 శాతం మార్కులు పొంది రుత్విక్ సాయి ప్రతిభ చాటిన విషయం విదితమే.

ప్రమాదాల బుడుమూరు

చిందింది రక్త కన్నీరు

- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- నలుగురు మృతి
- ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు
- ఇద్దరికి తీవ్ర గాయాలు





దువ్వారి మీనమ్మ (ఫైల్)



దువ్వారి లక్ష్మీపతి(ఫైల్)



ఉగ్రపల్లి భాస్కరరావు (ఫైల్)



శంకరరావు(ఫైల్)

ఒకే ఒక్క ప్రమాదం..
ఓ బాలికకు తండ్రిని దూరం చేసింది.
ఒకే ఒక్క దుర్ఘటన..
కొడుకు పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భార్యకు భర్త లేకుండా చేసింది.
అదే ప్రమాదం..
రెండు శుభ కార్యాల మధ్య కాలాన్ని విషాదంతో నింపేసింది.
అదే దుర్ఘటన..
తల్లి కళ్ల ఎదురుగా కొడుకును, ఆ కొడుకు సమక్షంలో తల్లిని చంపేసింది.
బుడుమూరు జాతీయ రహదారిపై రక్తం, కన్నీరు కలిసి ప్రవహించాయి. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో నాలుగు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మృతుల్లో ఒకరి ఇంటిలో రేపు పుట్టిన రోజు వేడుకలు జరగాలి. మరొకరి ఇంట్లో ఇటీవలే దత్తత మహోత్సవం జరిగింది. కానీ మృత్యువు ఆ ఆనందాన్ని చంపేసి రెండు కుటుంబాల్లో శోకాన్ని నింపింది.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



పాతపట్నం: పెద్దలోగిడిలో మృతుల ఇంటి వద్ద ఉన్న గ్రామస్తులు



కారులో మృతి చెందిన భాస్కరరావు, మీనమ్మ



ప్రమాద స్థలంలో శంకరరావు మృతదేహం



రిమ్స్ ఆస్పత్రిలో లక్ష్మీపతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల/రణస్థలం/పాతపట్నం/శ్రీకాకుళం క్రైమ్: లావేరు మండలం బుడుమూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నాలుగు ప్రాణాలను గాల్లో కలిపేసింది. టైరు పంక్చర్ కావడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. చనిపోయిన నలుగురిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ కుటుంబంలో ఆదివారం బర్త్‌డే వేడుకలు జరగాల్సి ఉంది. మరొకరి ఇంటిలో దత్తత వేడుక జరిగింది. కానీ వీరి విధిరాత మరోలా ఉంది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. పాతపట్నం గ్రామం పెద్దలోడి గ్రామానికి చెందిన దువ్వారి లక్ష్మీపతి(31) విశాఖపట్నంలోని మధురవాడలో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామంలో స్నేహితుడి వివాహానికి హాజరై శనివారం తిరుగు ప్రయాణమయ్యాడు. ఆదివారం తన అన్న కుమారుడి బర్త్ డే ఉండడంతో తన కారులోనే తల్లి మీనమ్మ (56), బావ ఉగ్రపల్లి భాస్కరరావు (45), మేన కోడలు కుసుమ, తండ్రి కాళిదాసుతో కలిసి బయల్దేరారు.

కారులో విశాఖ వెళ్తుండగా లావేరు మండలం బుడుమూరు సమీపంలో జాతీయ రహదారిపై కారు టైరు పంక్చర్ అయ్యి బండి అదుపు తప్పింది. సరిగ్గా అదే సమయానికి తోలాపి శంకరరావు(41) రోడ్డు పక్కన తన స్కూటీని ఆపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అదుపు తప్పిన కారు అమాంతం శంకరరావును ఢీకొట్టి రోడ్డు పక్కనే ఆపిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టి లేఅవుట్‌లోకి దూసుకుపోయింది. ఘటనలో శంకరరావు తీవ్రంగా గాయపడి అక్కడే ఊపిరి వదిలేశాడు. కారులో ఉన్న మీనమ్మ, భాస్కరరావు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. లక్ష్మీపతి, కాళిదాసు, కుసుమ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌లో వీరిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులకు కూడా సమాచారం అందజేశారు. అయితే లక్ష్మీపతి ఆస్పత్రిలో చేరుస్తుండగానే కన్ను మూశారు. క్షతగాత్రులు అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. లావేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కారు ఢీకొన్న లారీ కోసం పోలీసులు దృష్టి సారించారు.

ఒంటరైపోయింది..

ఘటనలో చనిపోయిన శంకరరావు స్వగ్రామం విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మద్దూరిశంకరపేట. ఈయన రణస్థలంలోని యూబీ బేవరేజెస్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ రణస్థలంలోనే ఉంటున్నారు. ఏడాది కిందటే శంకరరావు కుమారుడు అనారోగ్యంతో చనిపోయాడు. అనంతరం ఆయన ఓ బాలికను దత్తత చేసుకున్నట్లు సమాచారం. ఆ బాలిక జనన ధ్రువీకరణ పత్రం కోసం శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి, చేపలు పట్టుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో భార్య జీవన కుమారి కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆమె శ్రీకాకుళం రిమ్స్‌కు వచ్చారు. ఏడాది కిందటే కుమారుడిని కోల్పోయి తీరని శోకంలో ఉన్న ఆమెకు ఇప్పుడు భర్త కూడా దూరం కావడంతో గుండెలవిసేలా రోదించారు.

పెద్దలోగిడిలో విషాద ఛాయలు

పాతపట్నం: మండలంలోని పెద్దలోగిడి గ్రామానికి చెందిన దువ్వారి కాళిదాసు కుటుంబంలో ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాళిదాసు చిన్న కుమారుడు లక్ష్మీపతి వైజాగ్ మధురవాడలోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. స్నేహితుడి పెళ్లి కోసం వచ్చిన లక్ష్మీపతి అన్న కుమారుడి పుట్టిన రోజు వేడుకల కోసం కుటుంబాన్ని కారులో విశాఖకు తీసుకెళ్లాడు. అదే అతని ఆఖరి ప్రయాణమైంది. ఈ కారుకు యాక్సిడెంట్ జరిగి లక్ష్మీపతితో పాటు తల్లి మీనమ్మ, బావ భాస్కరరావు చనిపోవడంతో ఊరంతా విషాదంలో మునిగిపోయింది. లక్ష్మీపతి బావ ఉగ్రపల్లి భాస్కరరావు ఆటోడ్రైవర్‌గా పెద్దలోగిడి గ్రామంలో ఉంటున్నారు.



రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుసుమ



సంఘటనా స్థలాన్ని 'సాక్షి' విజిట్ చేసింది. ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడింది.

ప్రమాద స్థలం: బుడుమూరు జాతీయ రహదారి

ప్రమాదానికి కారణం: కారు టైర్ పేలడం!

ప్రమాదం జరిగిన సమయం: సాయంత్రం 5.40

5:40



- వాహనం ముందు భాగంలోని ఎడమ వైపున్న టైర్ పేలడంతో వాహనం అదుపు తప్పింది.
- రోడ్డు పక్కనే స్కూటీ ఆపి ఫోన్ మాట్లాడుతున్న వ్యక్తిని వేగంగా బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి స్కూటీ ముక్కలైంది. వాహనంపై ఉన్న వ్యక్తి స్పాట్‌లోనే మరణించారు.





- అయినా కారు వేగం కంట్రోల్ కాలేదు. అంతే వేగంతో అక్కడే ఆగి ఉన్న లారీ వెనుక భాగాన్ని డ్రైవర్ వైపు భాగం నుంచి బలంగా ఢీకొట్టింది.
- కారు కుడిభాగం నుజ్జు కావడంతో.. ఎయిర్ బెలూన్‌లు ఓపెన్ అయినా డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు.





- వెనుక వైపు కూర్చున్న వ్యక్తి ఒక్క ఉదుటన పక్కనున్న మహిళను ఢీకొనడంతో ఇద్దరూ సంఘటనా స్థలంలోనే చనిపోయారు.
- వెనుక భాగంలో ఉన్న ఇద్దరిలో ఏ ఒక్కరు సీట్ బెల్ట్ ధరించినా రెండు ప్రాణాలు నిలిచేవి.

పెద్దసాన పాఠశాలలో గందరగోళం

టెక్కలి: మండలంలోని పెద్దసాన గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం గందరగోళం చోటు చేసుకుంది. ఇటీవల పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ప్రసాద్ పలువురు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ, లిఖితపూర్వకమైన ఫిర్యాదుతో డీఈఓ తిరుమలచైతన్య పాఠశాలకు చేరుకుని విచారణ నిర్వహించి ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయుడు నేతాజీకు, సస్పెన్స్‌కు గురైన ఉపాధ్యాయుడు ప్రసాద్‌కు మధ్య విభేదాలు ఉండడంతో తమకు చెప్పకుండా తమ పిల్లలతో బలవంతంగా లిఖితపూర్వకమైన ఫిర్యాదు చేయించారంటూ కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ఎదురుగా నిరసన చేస్తూ ప్రధానోపాధ్యాయుడి తీరును తప్పుపట్టారు. తాజాగా శనివారం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు మరోసారి పాఠశాల ఎదురుగా నిరసన చేస్తూ ప్రధానోపాధ్యాయుడి దిష్టిబొమ్మతో నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు నేతాజీ ఎస్సీ సామాజిక వర్గంపై తప్పుగా మాట్లాడారని, అలాగే ఈ వ్యవహారంతో సంబంధం లేని ఓ మహిళా టీచర్ ప్రసాద్‌పై చేయి చేసుకున్నారనే వివాదం ఇప్పుడు తెరపైకి వచ్చింది. కులం పేరుతో దూషించడంపై ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు, దళిత సంఘాల ప్రతినిధులు చల్లా రామారావు, కె.దాలయ్య, జె.బాబూరావు, ఎ.రాహుల్, వై.గోపి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి టెక్కలిలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం నేతాజీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



టెక్కలిలో సమావేశం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు, దళిత సంఘాలు

సైకిల్ ర్యాలీ.. తీరాన్ని రక్షించాలి

సోంపేట: తీర ప్రాంత రక్షణపై అవగాహన కల్పిస్తూ దేశంలోని తీర ప్రాంతం గుండా సీఐఎస్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో మొట్టమొదటి సైకిల్ ర్యాలీ నిర్వహించినట్లు సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ఎం.అనిఫ్, డిప్యూటీ కమాండెంట్ వి.కె.ప్రభాకర్ తెలిపారు. సీఐఎస్ఎఫ్ ఏర్పాటు చేసి 56 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సైకిల్ ర్యాలీని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రారంభించారు. పశ్చిమబెంగాల్ బకేలి నుంచి ఒక బృందం, గుజరాత్ లఖపథ్ నుంచి ఒక బృందం సైకిల్ ర్యాలీ ప్రారంభించాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బృందం 700 కిలోమీటర్లు ప్రయాణించి శనివారం రాత్రి సోంపేటకు చేరుకుంది. ఈ రెండు బృందాలు మార్చి 31న కన్యాకుమారిలో కలిసి యాత్ర ముగించనున్నాయి. 9 రాష్ట్రాల్లో 25 రోజుల పాటు 100 మంది సభ్యులు 6553 కిలోమీటర్లు ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. 250 తీర ప్రాంత వ్యాపారకేంద్రాలు, 75 వ్యాపార కేంద్రాలను కలుపుకుంటూ ర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా నిషేధం, అక్రమ ఆయుధాల నివారణ, తీవ్రవాదుల చొరబాటు నియంత్రణ, తీరప్రాంత భద్రత, మహిళా సాధికారత, సముద్ర తీర ప్రాంత వృక్షజాలం, జంతుజాలం పరిరక్షణ కోసం సీఐఎస్ఎఫ్ కృషి చేస్తుందన్నారు. సోంపేటలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సోంపేట యువత ఘనస్వాగతం పలికారు. నటరాజ నాట్య కళామండలి సభ్యులు ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.



సోంపేటలో సైకిల్ బృందానికి స్వాగతం పలుకుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఐదు బృందాలతో శక్తి

- మహిళల భద్రతకు చర్యలు
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రత కోసం జిల్లాలో ఐదు బృందాలతో 'శక్తి' బీట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. మూడు సబ్ డివిజన్‌ల (టెక్కలి, కాశీబుగ్గ, శ్రీకాకుళం) పరిధిలో సబ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారి పర్యవేక్షణలో మూడు టీములు, జిల్లాకేంద్రంలో అదనంగా మరో రెండు టీమ్‌లు పనిచేస్తాయని, ఒక్కో టీమ్‌లో ఎస్ఐతో పాటు ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, ఇద్దరు పురుష కానిస్టేబుళ్లు, ఒక హెడ్‌కానిస్టేబుల్ ఉంటారన్నారు. శక్తియాప్ ద్వారా ఫిర్యాదు చేసిన 10 నిమిషాల్లో పోలీసులు ఘటనాస్థలికి చేరుకునేలా లక్ష్యం పెట్టుకున్నామని, పబ్లిక్ ప్లేసులు, విద్యాసంస్థలు, రైల్వే, బస్ స్టేషన్లు, ట్రావెలింగ్‌లో మహిళలు, విద్యార్థినులు, బాలికలపై ఈవిటీజింగ్ చేసినా, లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడటం వంటి అంశాలను సీరియస్‌గా తీసుకుంటామన్నారు. విద్యాసంస్థల్లో సెల్ఫ్ డిఫెన్సు క్లాసులు నిర్వహిస్తామని, నిష్ణాతులైన ప్రైవేటు డిఫెన్స్ వారిని, పోలీస్ ఫోర్స్, పీడీ బృందంతో క్లాసులు ఉంటాయన్నారు. ప్రతీ మహిళ కచ్చితంగా శక్తియాప్ ఇన్‌స్టాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్నప్పుడు మధ్యలో ఉన్న ఎస్‌ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే పోలీసులకు సమాచారం వెళ్తుందన్నారు. సమావేశం అనంతరం ఎస్పీ 15 శక్తి పెట్రోలింగ్ వాహనాలను ప్రారంభించారు. అయితే ఇవన్నీ పాత వాహనాలు కావడం విశేషం. మరమ్మతులకు గురైన వాటికి బాగు చేయించి వాటికే కొత్త స్టిక్కర్లు అంటించి ఆదరాబాదరాగా ఓపెన్‌చేశారు.



శక్తి ద్విచక్ర వాహనాల ప్రారంభోత్సవంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఇతర పోలీసు అధికారులు

పరీక్షలు ముగిశాయి.. మూల్యాంకనమే తరువాయి

- ముగిసిన ఇంటర్మీడియెట్ రెగ్యులర్ కోర్సుల పరీక్షలు
- 12వ రోజు 365 మంది గైర్హాజరు
- జిల్లాలో ఈ ఏడాది రెండు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రధాన పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. ఇక మూల్యాంకనమే మిగిలి ఉంది. ఈ నెల 13వ తేదీతో ఇంటర్ ప్రథమ సంవత్సరం రెగ్యులర్ కోర్సుల పరీక్షలు ముగియగా, శనివారంతో ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ కోర్సుల పరీక్షలు ముగిశాయి. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే జిల్లాలో అతితక్కువ కేంద్రాల్లో కేవలం పదుల సంఖ్యలో మాత్రమే విద్యార్థులు రాసే పలు బ్రిడ్జ్ కోర్సుల పేపర్లకు మార్చి 19వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 17,452 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 17,087 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 365 మంది గైర్హాజరయ్యారు. ఈ ఏడాది రెండు మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదయ్యాయి.



ఇళ్లకు బయల్దేరిన ఇంటర్ విద్యార్థులు

మూల్యాంకనానికి ఏర్పాట్లు

ఈ నెల 17వ తేదీ నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్మీడియెట్ జవాబుపత్రాల దిద్దుబాటు ప్రక్రియ మొదలుకానుంది. నాలుగు విడతల్లో జరగనున్న ఈ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నారు. సీసీ కెమెరాలను అమర్చడంతోపాటు ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేస్తున్నారు.

జువైనల్ కోర్టుకు నిందితుడి తరలింపు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేట పరిధిలోని కామేశ్వరినగర్ వద్ద ఇటీవల వృద్ధురాలి హత్య కేసులో నిందితుడిని పోలీసులు శనివారం జువైనల్ కోర్టులో హాజరుపరిచారు. ఈ నెల 3వ తేదీన కేవిటి గున్నమ్మ(85) హత్యకు గురైన విషయం విదితమే. ఈ హత్యతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న బాలుడిని పోలీసులు శనివారం జువైనల్ కోర్టుకు తరలించారు. ఈ మేరకు నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

రెవెన్యూ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం



బుక్కూరు ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగులకు సేవలు అందించడంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా రెవెన్యూ వసతి గృహం ఆధునికీకరణ, మెగా మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లాకు చెందిన సీనియర్ రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు బుక్కూరు ఉమామహేశ్వరరావు, పి.జగన్మోహన్‌రావు, ఎం.కాశీప్రసాద్‌లను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం కార్యదిర్శ రామశెట్టి రాజేష్, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.ఎస్.ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాదిలాపు శ్రీనివాసరావు, ప్రవల్లిక, దిలీప్ చక్రవర్తి, కలెక్టరేట్ పరిపాలనాధికారి గుడ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెమ్స్‌లో అవగాహన సదస్సు

శ్రీకాకుళం రూరల్ : రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగ అవకాశాలు – శిక్షణా తరగతులపై ఈ నెలాఖరున అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిమ్స్ గ్రూప్ చైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరవుతారని పేర్కొన్నారు. అర్హులైన వారికి ఏడాది శిక్షణ కాలంలో స్టైఫండ్ కూడా అందిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డయాలసిస్ యూనిట్లు ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో శనివారం ఎనిమిది నూతన డయాలసిస్ యూనిట్లను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాల ప్రారంభించారు. అనంతరం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ సెక్రటరీ వెంకన్న చౌదరి, ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజ, నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో వలస కూలీ మృతి



వంక ప్రకాశ్(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని డోకులపాడు గ్రామానికి చెందిన వలస కూలీ వంక ప్రకాశ్ (36) గుజరాత్‌లో శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి తండ్రి కృష్ణ ఆరు నెలల కిందటే మృతి చెందాడు. నిరుపేద కుటుంబంలో ఆరు నెలల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రకాశ్‌కు తల్లి హేమలత, భార్య లలిత ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో వీధిన పడ్డ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు ,స్థానికులు కోరుతున్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న నారాయణశెట్టి రవణమ్మ(63) అనే వృద్ధురాలి చీరకు నిప్పంటుకోవడంతో గాయాలపాలై మృతిచెందింది. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రవణమ్మ శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో ఇంట్లో కరెంట్ పోవడంతో కొవ్వొత్తి వెలిగించగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని మోకాలి వరకు పూర్తిగా కాలిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈమెకు భర్త సత్యనారాయణ, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి వివరాలు లభ్యం

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల మండలం జరజాం జాతీయ రహదారి సమీపంలో ఈ నెల 13న తుప్పల్లో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వివరాలు లభ్యమయ్యాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా..మృతుడు ఆమదాలవలస మండలం బెలమాం గ్రామానికి చెందిన ఎరగడ రాముగా గుర్తించారు.

149 కేంద్రాలు.. 28,984 మంది విద్యార్థులు

- రేపటి నుంచే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్ధం చేసిన ఫర్నిచర్‌తో ఉపాధ్యాయులు



విజయీభవ: ఆల్‌ది బెస్ట్ చెబుతున్న టెన్త్‌క్లాస్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ :

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయి. పోలీసు పహారా నడుమ ప్రశ్నపత్రాలను స్టోరేజ్ పాయింట్లలో ఇప్పటికే భద్రపరిచారు. హాల్‌టికెట్ల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది.

పకడ్బందీగా ఏర్పాట్లు..

నాడు–నేడు ద్వారా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమకూర్చిన ఫర్నిచర్, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు, ఇతర మౌలిక వసతులు, సౌకర్యాలతో పరీక్ష కేంద్రాలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు. శనివారం కూడా మండల ఎంఈవోలతో డీఈఓ వీసీ నిర్వహించి పలు సూచనలు చేశారు. పరీక్ష నిర్వహణకు గాను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఇప్పటికే పలుమార్లు సమీక్షించారు. 149 మంది చొప్పున సీఎస్‌లు, డీవోలు, 65 సి–సెంటర్లలో కస్టోడియన్లను నియమించారు. కస్టోడియన్లే సిట్టింగ్ స్క్వాడ్‌లుగా వ్యవహరిస్తారు. తనిఖీల కోసం విద్యాశాఖ, రెవిన్యూ శాఖ, పోలీసుశాఖల పర్యవేక్షణలో 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. మరో 20 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నారు. 8 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలను అమర్చారు. 2400 మంది వరకు ఇన్విజిలేటర్లను నియమించారు. అయితే పనిచేస్తున్న చోటు నుంచి సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలకు అధికారులుగా, ఇన్విజిలేటర్లగా నియమించడం పట్ల ఉపాధ్యాయులు గగ్గోలుపెడుతున్నారు.

- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు.
- నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.
- కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటించారు. చీఫ్ సూపరెండెంట్‌తో సహా ఏ ఒక్కరి దగ్గర మొబైల్‌ఫోన్లు ఉండటానికి వీల్లేదని అధికారులు పేర్కొంటున్నారు. పోలీసులు, మెడికల్ సిబ్బంది సైతం పరీక్ష కేంద్రం వెలుపలే ఉండాలని అధికారులు స్పష్టంచేస్తున్నారు.
- పరీక్షల సమయంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేస్తారు.
- విద్యార్థులు సెల్‌ఫోన్లు, క్యాలక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రాలకు తీసుకురావడం నిషిద్ధం.
- విద్యార్థులు 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి. 8.45 నుంచి పరీక్ష కేంద్రాలలోపలకి అనుమతిస్తారు. 9.30 తర్వాత నో ఎంట్రీ.
- 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్లలో మాత్రమే పరీక్ష రాయాలి. అడిషనల్ షీట్లు ఇవ్వరు.

బస్సుల్లో ఉచిత ప్రయాణం..

పదో తరగతి విద్యార్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ శుభవార్త ప్రకటించింది. పరీక్ష జరిగే రోజుల్లో టెన్త్ హాల్‌టికెట్ చూపిస్తే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా విద్యార్థులు ప్రయాణించేలా చర్యలు తీసుకుంది. ఈ మేరకు అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. జిల్లా వ్యాప్తంగా 25 రూట్లలో బస్సు సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

కేంద్రాల సంఖ్య	ఎ-సెంటర్లు	బి-సెంటర్లు	సి-సెంటర్లు	మొత్తం విద్యార్థులు	రెగ్యులర్ విద్యార్థులు	బాలురు	బాలికలు
149	56	28	65	28,984	28,276	14,333	13,943

హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు..

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కేంద్రాలపై సందేహాల నివృత్తికి, సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 08942-220724, అసిస్టెంట్ కమిషనర్ సెల్: 95056 78655 నంబర్లకు కాల్‌చేసి సమస్యలను తెలియజేయవచ్చని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌గా శ్రీకాకుళం జీజీహెచ్‌స్కూల్‌ను కొనసాగిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



రేపటి నుంచి మొదలయ్యే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. 65 సి–సెంటర్లను గుర్తించాం. 8 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చాం.

– లియాఖత్ అలీఖాన్, అసిస్టెంట్ కమిషనర్, పరీక్షల విభాగం జిల్లా విద్యాశాఖ శ్రీకాకుళం

అందరూ సహకరించాలి..



పరీక్ష కేంద్రాలకు సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లు, తనిఖీ బృందాలు, సిబ్బంది నియామకం పూర్తయింది. కలెక్టర్ ఆదేశాల మేరకు వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులంతా సహకరించి పరీక్షల ప్రక్రియను పూర్తి చేయాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం

పాలనా వ్యవస్థలో రెవెన్యూ శాఖ కీలకం

- వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ పాలనా వ్యవస్థలో రెవెన్యూ శాఖ కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఇందులో పనిచేసే ఉద్యోగులు రేయింబవళ్లు పనిచేస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరితో ఉంటారని, దీన్ని దష్టిలో పెట్టుకొని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ అతిథి గృహం ఆధునికీకరణను, వైద్య శిబిరాలను రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, అమరావతి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అధికారులు అంకితభావంతో పనిచేయటం వల్ల భూమి సమస్యలు లేని జిల్లాగా శ్రీకాకుళం రూపొందుతోందని చెప్పారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాన్ని రెవెన్యూ శాఖ కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీరాములు బి.వి.ఎస్.ఎన్.రాజు, పాదిలాపు శ్రీనివాసరావు, ప్రవల్లిక, కలెక్టరేట్ పరిపాలన అధికారి గుడ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

రెవెన్యూ సర్వీసులు సంఘం, డాక్టర్ శశిధర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అన్నెపు శశిధర్, కార్డియాలజిస్టులు డాక్టర్ సాయితేజ బరాటం, డాక్టర్ పూజారి హరిబాబు, జనరల్ సర్జన్ డాక్టర్ చింతాడ గోవిందరావు, గైనకాలజిస్టు డాక్టర్ సనపల సుకన్య, ఆర్థోపెడిక్ డాక్టర్ కింతలికిషోర్, డాక్టర్ బమ్మిడి ప్రభులు వైద్య సేవలు అందించారు. ఆదివారం కూడా శిబిరం కొనసాగుతుందని డాక్టర్ శశిధర్ తెలిపారు. సీపీఆర్, బీఎండీ స్కాన్, థైరాయిడ్ పరీక్ష, డయాబెటిక్, యూరిక్ యాసిడ్, హిమోగ్లోబిన్, సర్వైకల్ కాన్సర్, బెస్టు క్యాన్సర్, ఈసీజీ, 2డీ ఎకో, జీఈఆర్‌డీ, బీఎంఐ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నదుల పరిరక్షణ అందరి బాధ్యత



నాగావళి నదిని శుభ్రం చేసిన అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న పీసీబీ ఈఈ కరుణశ్రీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నదులను కాలుష్యపు కోరల నుంచి పరిరక్షించాలని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కరుణశ్రీ అన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న నాగావళి నదిలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ శ్రీకాకుళం– స్వచ్ఛ నాగావళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణశ్రీ మాట్లాడుతూ నదుల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని ఇందులో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నదుల దురాక్రమణ పర్యావరణ వినాశనానికి, నీటి వనరుల క్షీణతకు కారణమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ నటుకుల మోహన్, మంత్రి వెంకటస్వామి, ఆంధ్రా ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఏఓఎల్) ఎం.కృష్ణయ్య, అపర్ణ ఫార్మాస్యూటికల్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ మేనేజర్ శ్యామ్ బాబు, ఎపిటోరియా ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ లైజినింగ్ ఆఫీసర్ ప్రసాద్, మహాధన్ పరిశ్రమ హెచ్‌ఆర్ రాజేష్, సరాక కంపెనీ ప్రతినిధి ఎ.బ్రహ్మారెడ్డి, రాజశేఖరరెడ్డి, ఎప్టోరియా కంపెనీ జనరల్ మేనేజర్ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను కొనసాగించాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలని కాంట్రాక్ట్ – ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా నాయకులు ఆర్.చిన్నారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ – స్థానిక సంస్థలలోని ఔట్‌సోర్సింగ్, యూనివర్సిటీలు, ప్రభుత్వ సొసైటీలు, విద్యుత్, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష తదితర అన్ని ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఏపీ కాంట్రాక్ట్ –ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ముందుగా శ్రీకాకుళం ఆర్ అండ్ బీ బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆప్కాస్‌లో వివిధ విభాగాల ప్రతినిధులు నక్క శ్రీనివాసరావు, ధన్వంతరి, ప్రసాద్, గుజ్జల ఆదినారాయణ, రిమ్స్ ఉద్యోగులు కె.తేజ, టి.కిరణ్, టి.సాయి, జి.ధర్మారావు, జ్యోతికుమారి, మౌనిక, ప్రత్యూష, శిరీష పాల్గొన్నారు.

తూనికల్లో మోసాలు అరికడతాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తూనికల్లో ఎక్కడ ఎటువంటి తేడాలున్నా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే చర్యలు చేపడతామని తూనికలు, కొలతల శాఖ ఏసీ విశ్వేశ్వరరావు తెలిపారు. 'మోసం గురూ' శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లాలో తూకాలకు సంబంధించి ఎక్కడ తేడా గుర్తించినా తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారి శంకర విశ్వేశ్వరరావు(సెల్:9398153671), శ్రీకాకుళం డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.రాజారమేష్(సెల్: 9398124319), టెక్కలి డివిజన్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్(సెల్:9398146671)లకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీ, 5వ లైన్, వార్డు సచివాలయం మేడపై ఉన్న తమ కార్యాలయంలో నేరుగా వచ్చి కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పాలిటెక్నిక్‌తో అపార ఉద్యోగావకాశాలు



దామోదర్‌రావు, జిల్లా ప్రవేశాల ఇన్‌చార్జి

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి తర్వాత తక్కువ వయసులోనే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే పాలిటెక్నిక్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల ఇన్‌చార్జి గురుగుబెల్లి దామోదర్‌రావు అన్నారు. కళాశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్‌బీటీఈటీ.ఏపీ.జిఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు. ఉమ్మడి జిల్లాలో పది ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయని చెప్పారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 300, మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, సీతంపేట మోడల్ పాలిటెక్నిక్‌లో 120 సీట్లు ఉన్నాయని వివరించారు. 10వ తరగతి పరీక్షలు పూర్తయ్యాక ఉచితంగా కోచింగ్ ఇచ్చి స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు.

ఓపెన్ స్కూల్..
పరీక్షలకు సన్నద్ధం

- జిల్లాలో రేపటి నుంచే సార్వత్రిక పదో తరగతి పరీక్షలు
- 8 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 807 మంది విద్యార్థులు



ఓపెన్ స్కూల్ లోగో



ఎస్సైన్‌మెంట్ పరీక్షలను రాస్తున్న టెన్త్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 17 నుంచి నెలాఖరు వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 807 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించగా.. వీరంతా పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాలను ఎంపికచేశారు. శ్రీకాకుళం నగరంలో నాలుగు, టెక్కలిలో రెండు, పలాసలో రెండు చొప్పున కేంద్రాలను కేటాయించారు. ఈ కేంద్రాలకు సీఎస్‌లు, డీవోలతో పాటు 8 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్ష నిర్వహణ మెటీరియల్స్‌ను సైతం చేరవేశారు. కాగా ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్మీడియెట్ పరీక్షలు ఇటీవలే ముగిసిన సంగతి తెలిసిందే. మండుటెండల నేపథ్యంలోఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లతో పాటు మరుగుదొడ్లు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో 144 సెక్షన్‌తోపాటు ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా నిషేధమని , పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీవోలతో ఏర్పాట్లపై ఇప్పటికే పలుమార్లు సమీక్షించి సూచనలిచ్చామని అధికారులు చెబుతున్నారు. మరిన్ని వివరాలకు 83282 69673, 95056 78655 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఏర్పాట్లు పూర్తయ్యాయి

జిల్లాలో ఈ నెల 17 నుంచి ఎనిమిది కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు జరుగుతాయి. కలెక్టర్ ఆదేశాలు, డీఈఓ సూచనల మేరకు ఇప్పటికే అధికారులను నియమించాం. విద్యార్థులు హాల్‌టికెట్లను అధ్యయన కేంద్రాల నుంచి తీసుకోవాలి. ఏపీఓపెన్‌స్కూల్.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉన్నాయి.

– లియాకత్ అలీఖాన్, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్

స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి శశిభూషణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి శశిభూషణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా వివరాలను కలెక్టర్ వివరించారు. బాహుదా ఓపెన్ హెడ్ చానల్, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, మూలపేట పోర్టు, నదుల అనుసంధానం, హిరమండలం రిజర్వాయర్ తదితర పనుల పురోగతిపై చర్చించారు. డీసీహెచ్ డాక్టర్ కళ్యాణ్‌బాబు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులకు సంబంధించి కొరత లేకుండా మందులు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ షకీలా, ఎంపీఐ గంగాధర్, ఉపాధి పీడీ సుధాకర్, డీఎఫ్ఓ వెంకటేష్, మైన్స్ శాఖ డీడీ మోహనరావు, డీఆర్ఓ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓలు కృష్ణమూర్తి, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, లక్ష్మణమూర్తి, సివిల్ సప్లయ్ డీఎం వేణుగోపాల్, డీటీసీ ఎ.విజయసారధి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, భూగర్భ గనుల శాఖ డీడీ మోహనరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, డీఎస్‌ఓ సూర్యప్రకాష్, డ్వామా పీడీ సుధాకర్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, సీపీఓ లక్ష్మీప్రసన్న, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతి శ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాషా, వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఇచ్ఛాపురం రూరల్: విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొళిగాం గణేష్ బ్రిక్ ఇండస్ట్రీలో పనిచేస్తున్న రాజేష్ చవాన్(25) శనివారం స్నేహితుడితో కలిసి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వెళ్తూ పాయితారి వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడు తీవ్ర గాయాలపాలవ్వడంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించి ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వారు ఒడిశా, బీహార్ ప్రాంతాలకు చెందిన వారని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.